జన్మహక్కు

ఆయింట్లో గడియారానికి గూడా నిద్రపడు తున్నట్లులేదు. అర్ధ రాత్రయినా మెలకువతోవుండి లెక్క తప్పకుండా పన్నెండు గంటలూ కొట్టింది. ఒక్కొక్క గంటా లెక్కపెడుతూ రాఘవరావు మంచంలో అటూ యిటూ మసులుతున్నాడు తన కేవేళప్పుడు కబురు వస్తుందోనని.

ముసలమ్మ వంటింటి గుమ్మం దగ్గరే మండిగం తలగడా మాదిరి చేసుకుని దొంగ నిద్రపోతోంది. గోడ గడియారం గంటలు వినబడగానే వులిక్కిపడిలేచి “ఎట్లా వుందే అమ్మాయి” అంటూ ఆవలించింది. అప్పటిదాకా పక్కనే పడుకున్న జానకి కనిపించక పోయేటప్పటికి, ముసలమ్మ ఒకసారి కళ్లు నులుముకుని లేచి కూర్చుంది. అప్పటికి గాని ఆవిడ స్వప్న జగత్తులోనుంచి వూడి పడలేదు.

జానకి దొడ్డివాకిలి తీసి తలుపు కానుకుని మూలుగుతోంది. ముసలమ్మ దృష్టి అటు పోవటం తోనే “ఎట్లావుందే అమ్మాయి” అంటూ చకచకా అటువైపు వెళ్లింది.

“కాళ్ళు నిలవటంలేదు మామ్మగారూ...” జానకి మూలుగు కొంచెం హెచ్చించి దొడ్డిలోని గిలక బావివైపు చూసింది.

“పెద్దదాన్ని యిక్కడే యిదైపోయాను గాదుటే నాతో యింత వరకూ ఎందుకు చెప్పలేదే...” ముసలమ్మ నెత్తిన గుడ్డ జారిపోకుండా పైకి లాక్కుని “వరేయి రాఘవా! ఏం నిద్రరా...అంతా మొద్దుల్లాగా అలా పడు కున్నారేం రా....వరేయి రామూ...” గబ గబా రాఘవరావు పడుకున్న గదివైపు నడిచింది.

“నా నిద్ర వక్కడిదీ చెడిపోతే చాల్లే అమ్మమ్మా...పిల్లల నిద్ర గూడా ఎందుకు పాడు చేస్తావు” రాఘవరావు దుప్పటి కాళ్ళతో కిందకి తోసి విసుక్కుంటూ లేచాడు.

“నీకే లేరా...ఈ ప్రపంచంలో వుంది పిల్లలు. .ముందర వాళ్లని లేవగొట్టి ఆ గది ఖాళీ చెయ్యాలి.....అలా నిలబడతావేం రా తలుపు చెక్కలాగ”

రాఘవరావు జుట్టు వేళ్ళతో సరి చేసుకుని "పద దండయాత్రకి" అన్నాడు.

ముసలమ్మ గబగబా గదిలోకి పోయి రాము, వేణు, శాంత వగైరాల నందరినీ రెక్కపట్టుకు లేవదీసి "సావిట్లోకీ పదండిరా పడి నిద్రపోదురు గాని ఊ" అంటూ గదమాయించింది.

"ఊరుకో అమ్మమ్మా నువ్వు... నేను లేపుతాగా....చంద్రింలే నాన్నా. గది ఖాళీచెయ్యాలి గాని, మా బాబు గదూ... పందిరిమంచం మీద పండుకో బెడతానుగా...మా చంద్రం మం...చివాడు...''రాఘవరావు పిల్లవాడి వీపుమీద నిమురుతూ రెండో చేత్తో బుగ్గలు స్పృశిస్తున్నాడు

"యింక సాగినట్టే... లెండర్రా చెబుతుంటే మీ క్కాదూ..." ముసలమ్మ గావు కేకతో పిల్లలంతా వక్కసారి లేచి సావిట్లోకిపోయి ఎవరికేది అందుతే దానిని పట్టుకు కునుకు తీయటం మొదలు పెట్టారు.

"ఆ మంచం పట్టుకు రారా... నులకది... ఆ అదే రామిగా ....నువ్వు పోయి సింగిని పిలుచుకురారా..."

"ఎక్కడే అమమ్మా..." రాము కళ్ళు నులుముకుంటూ వాకిట్లోకి చూచాడు 'అంత చీకట్లో బయటికి పోవాలిగదా' అని భయపడుతూ.

"మాబాబు గదూ... బ్యాటరీ లైటు తిసుకుపో...వెంకన్న బావి లేదూ... దాని పక్కన గుడిసెలో వుంటుంది... కిందటేడు పోలేదురా...మతి మరుపూ నువ్వూను." ముసలమ్మ గూట్లోనుంచి బ్యాటరీ లైటు తీసి రాముడి చేతికిచ్చి వంటింట్లోకి పోయింది.

జానకి అట్లాగే కూలబడివుంది. రాఘవరావు గూడా వంటింట్లోకి ముసలమ్మతో పాటు పోయాడు జానకిని గదిలోకి తీసుకురావటంలో సాయం పడదామని.

"వద్దండి....నేను నడుస్తాను" జానకి మోపంతా ముసలమ్మ మీద వుంచి తూలుతూ గదిలోకి వచ్చింది.

చంటి పిల్ల పాలకోసం ఆవురావురు మని ఏడుస్తోంది. శాంత పసిపాపను సముదాయించటం చేతకాక ఏడుపు మానిపిద్దామని పటుకు చాప కొడుతోంది. వేణు శాంత చేస్తున్న అల్లరిని సహించలేక దాని జుట్టుపీకి నాలుగు లెంపకాయలు కొట్టాడు. శాంత ఎదురు కొట్టలేక పసిపాపతో శ్రుతి కలిపి ఏడుపు ప్రారంభించింది.

"మీ గోల పాడయి పోను" ముసలమ్మవచ్చి ఎదురుగా కూర్చున్న వేణుకు నాలుగు తగిలించింది. వాడుగూడా ట్రూపులో చేరి ఏడవటం మొదలు పెట్టాడు. రాఘవరావు అక్కడి మంచాలు ఇక్కడా, ఇక్కడివి అక్కడా సర్ది నలుగురికి పక్కలమర్చి పడుకోబెట్టాడు. యిప్పుడు ఎవరి మంచం మీద వారు పడుకుని తీరికగా వేరు వేరు శ్రుతులలో ఏడుస్తున్నారు.

జానకి మూలుగు ఎక్కువయింది. ముసలమ్మగదిలోకి, బయటికి అసులో గొట్టాం లాగా తిరుగుతోంది. రాఘవరావు వాకిట్లోకి గది దగ్గరికి గూడ్సు పెట్టెలాగా కదులుతున్నాడు. సింగి యింకా రాలేదు. రాము దాని సంగతైనా ఎత్తలేదు. "నిద్రలేపి పిలుచుకు వస్తూవుంటాడు బహుశా" అనుకుంది ముసలమ్మ.

రాఘవరావు బెడ్‌లైటు తీసుకుని వాకిలిదాకా పోయి అది ఆరి పోవటం వలన మళ్ళావచ్చి లాంతరు తీసుకువెళ్ళాడు. సందు చివరి దాకా వెళ్ళి చూసివద్దామను కున్నాడు. "వూరికే అక్కడిదాకా పోతే మటుకు అవుర్దాగాని ఏం వుపయోగం" అనుకుని మళ్ళా వెనక్కి వచ్చాడు. గదిదగ్గరకు రాగానే వక్కసారిగా మూలుగు ఎక్కువయి నట్లు అనిపించింది.

"ఎట్లావుంది జానకీ" గదితలుపు తెరిచాడు రాఘవరావు. ముసలమ్మ లోపలనుంచే తలుపు ఫెడీలుమని వేసి "సిగ్గు లేదుట్రా రాఘవా.. మహాగదితలుపు తీస్తున్నావు" అంటూ అరిచింది.

రాఘవరావు సిగ్గుతో కుదించుకుపోయాడు. రాము వస్తున్నాడో లేదో చూద్దామని, యింట్లో పనిచేస్తున్నది ఒకటే లాంతరవటంవలన, మూలవున్న లాంతరును బయటకు తీసుకు వచ్చాడు ఆ పూట పని

కద్దైనా అదుకుంటుం దేమోనని. కిరసనాయిలు పోసి వెలిగించగానే ఎవరి అదృష్టమో తెలియదు గాని లాంతరు మటుకు వెలిగింది.

కొత్తలాంతరు గది బయటి ముక్కాలి పీటమీద పెట్టి అప్పుడే వెలిగించిన లాంతరు తీసుకొని వీధిలోకి బయలుదేరాడు. సందు చివర దాకా పోగానే లాంతరు కాస్తా గుప్పుమంది. పంచప్రాణాలు వకసారి కట్ట కట్టుకుని ఎగిరిపోయి నట్లయింది. పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ యింటికి చేరాడు యుద్ధంలో వోడిపోయిన వీరుడిలాగా.

అప్పటికే సింగి, రాము, యింటికి వచ్చేశారు. పక్కసందులో నుంచి వాళ్ళు వచ్చారని రామం చెప్పేటంతవరకూ తెలియలేదు. సింగి గదిలోకిపోయి, ముసలమ్మను బయటికి పంపింది.

పిలలంతా ఎవరి మంచాలమీద వాళ్లు ఏడుపు మానేసి తీరికగా కూర్చున్నారు. పసిపిల్లలు మటుకు ఏడుపు తగ్గించలేదు. రాము పడు కోవడానికి చోటు కనిపించలేదు. అట్లాగే ఆలోచిస్తూ నిలబడ్డాడు.

సింగి గదిలోపల నుంచి "అది కావాలి...యిది కావాలని" అరుస్తోంది. ముసలమ్మ అటూ యిటూ పరుగెత్తలేక సతమత మయి పోతోంది. జానకి మూలుగు మటుకు బాగా ఎక్కువయి పోయింది. రాఘవరావు గదికి పది గజాల దూరంలో నిలబడి తల పట్టుకుని కూర్చున్నాడు.

.....ఏమిటో ఆలోచనలు అతని మెదడంతా స్వేచ్ఛా విహారం చేస్తున్నాయి. చంద్రం పెద్ద పిల్లవాడు; శాంత, వేణు, కవల పిల్లలు. దాని తర్వాత చంటిపిల్ల. ఇప్పటి విషయం కనపడుతూనే వుంది. పెళ్లి చేసుకుని స్వేచ్ఛగా బ్రతికిందే కనపడలేదు.

కాపరానికి వచ్చిన అయిదో నెల లోనే సూడిదలవీ, తర్వాత పురిటికనీ జానకిని పుట్టింటివారు తీసుకు పోయారు. అప్పుడే అతని మనస్సు కొద్దిగా చలించింది. ఈ వరసని సంతానం పెరుక్కుంటూ వస్తే తన జీతం కాదుకదా, తన వూళ్ళో వాళ్ళందరి జీతాలు కలిపినా తన కుటుంబ పోషణకు సరిపోదేమోనని భయపడ్డాడు. ఆ భయమే అతన్ని, జానకి పురుడు పోసుకున్నా, తనింటికి తొందరపడి తీసుకు

రాకుండా చేసింది. తనొక్కడికి తోచదని తన బావమరిది రాముసు తెచ్చుకున్నాడు. అప్పటినుంచి చదువుకని అతనితో పాటే వుండి పోయాడు.

జానకిని తనింటికి తెచ్చుకోవడానికి యిష్టం లేకపోయినా, ఆమె తల్లిదండ్రుల దగ్గిరనుంచి వస్తున్న వత్తిడివలన రాఘవరావు కాదన లేకపోయాడు. చంద్రానికి అయిదో నెల అనగా జానకి అత్తవారింటికి తిరిగి వచ్చింది. రాఘవరావు చంద్రాన్ని అప్పుడప్పుడూ ఎవరూ చూడకుండా పలకరించే వాడుగాని, జానకితో చాలా ముభావంగానే వుంటూ వచ్చాడు. జానకి తన లోపం ఏమన్నా వుందేమోనని ఆత్మ పరిశీలన చేసుకుని ఏమీ తెగక బుర్రంతా పాడు చేసుకుంది.

రాఘవరావు ప్రవర్తన రోజు రోజుకూ మితిమీరి పోయింది. అప్పుడే జానకీ వచ్చి అయిదారు నెలలు కావస్తున్నా మనసిచ్చి రాఘవరావు ఆమెతో మాట్లాడిన పాపాన పోలేదు. పని వుందంటూ పొద్దున్నే పోవటం, తిరిగి రాత్రి పది గంటలవుతే గాని యింటికి వచ్చేవాడు గాదు. మధ్యాహ్నంగూడా యింటికి రాని రోజులలో భోజనం ఆఫీసుకు పంపటం జరుగుతూ వచ్చింది. జానకి నిగ్రహించుకో లేక రాఘవరావుని ఒక రాత్రిపూట నిలవేసి అడిగింది. రాఘవరావు మాట తప్పించేసి "ఏం లేదంటూ" నసిగాడు. జానకికి కళ్ళ నీళ్ల పర్యంతం అయింది.

"నేనేం పాపం చేశానని — నోరెత్తి నాతో మాట్లాడడం కూడా మానేశారు..." కొంగుతో కళ్లు తుడుచుకుంది జానకి. ఆడవాళ్ళకు అనుకుంటే ఏడుపు వస్తుందని, ఆ సంగతి తెలిసినా మగవాళ్ళు మాయలో పడిపోతారని, ఏదో సైకాలజీ పుస్తకంలో రాఘవరావుకు చదివినట్లు జ్ఞాపకం.

అయినా యిది నిజం ఏడుపు గానే తోచింది. అతని తప్పు కళ్ళకు కొట్టు వచ్చినట్లు కనపడింది. జానకి ఏం తప్పు చేసిందని తను యింత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడు? చంద్రం పురిటికని తీసుకు వెళ్ళిన తర్వాత...చంద్రానికి అప్పుడే ఏడాది వెళ్ల వస్తోంది. యింత వరకు

ఇంత కఠినంగా ఘోరంగా ఎలా మసల గలిగాడో అతనికే ఆశ్చర్యం వేసింది.

రాఘవరావు మనసులో అనుమానం వేధిస్తూనేవుంది. జానకిని దగ్గరకు తీసుకుని చెవులో ఏదోరహస్యంగా చెప్పాడు; ఆ కారణంగా తన ప్రవర్తన మార్చుకున్నానన్నట్లు అతని ముఖంలోని చిరునవ్వు ఆమె ముఖంలో ఆనంద జ్యోతిని వెలిగించింది. "పొండి...." అంటూ అతన్ని పక్క తోపు తోసి గది బయటకు చరచరా నవ్వు కుంటూ వెళ్ళిపోయింది. రాఘవరావు మనస్సుకు కొంచం సంతృప్తి కలిగింది—ఎలాగయినా వక ఏడాది పాటు తనమాట బింకంగా నిల పెట్టుకో గలిగాను గదా అని.

ఆరోజు సాయంత్రం పెద్ద పొట్లాంతో మల్లెపూలు కొనుక్కు వచ్చాడు. అఫీసునుంచి సరిగ్గా టైముకే బయలుదేరి యింటికి వస్తూ. జానకి పూల పొట్లం అందుకుంటూ "చంద్రానికి యిన్నిపూలు ఎందు కండి? అందులో మొగపిల్లాడాయెను." నవ్వింది అతని పైపుచూసి. "వాడికి సరిపోయేవి వాడికి పెట్టు. మిగిలినవాటితో నాకు పని వుందిలే" అన్నాడు ఆమెను తోసుకుంటూ యింట్లోకిపోతూ. "వూరుకోండి, మరీ వుప్పలాయిగావుందే" అంది జానకి.

అదే తారీఖు మళ్ళీ అయిదు నెలల తర్వాత వచ్చింది. జానకి తల్లి పెద్ద చలిమిడి బుట్టతో దిగింది ఆ యింట్లోకి. మలుచూలు గూడా పుట్టింట్లోనే పోయటం వాళ్ళింటి ఆచారమట. రాఘవరావుకు ఆ గొడవలన్నీ తెలియవు. అయిన అవమానానికి పురుడు తనింట్లో గూడా ఎందుకని 'తీసుకు వెళ్ళండి అత్తయ్యా...మీ మాట ఎప్పుడు కాదన్నానుగనుక' అన్నాడు రాఘవరావు. ఆవిడ కణతల మీద వేళ్ళు నొక్కుకుంటూ 'బంగారునాయనా నీ అత్త కడుపు చల్లగా పదుగురు పిల్లలకు తండ్రి అవుతావు' అంది. రాఘవరావు ఆ దీవన వినటానికి మనసొప్పక ఏమిటో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

జానకి పురిటికి వెళ్ళిపోయింది. రాఘవరావు, జానకి తమ్ముడు రాముతో కాలక్షేపం చేస్తున్నా[illegible] వంటపని అంతా రాఘవరావు

అమ్మమ్మే చూస్తుంది, కూరలూ, నారలూ రాము పట్టుకు వస్తున్నాడు. రాఘవరావు పనంతా నెల మొదటి తారీఖున ఖాతా కొట్లన్నిటి లోనూ బాకీలు చెల్లించి వెయ్యటం, నెల పొడుగునా సరిపొయ్యేటట్లు బియ్యం, పప్పు దినుసులూ తీసుకువచ్చి యింట్లో పడెయ్యటం.

అత ననుకున్నట్లు గానే పురుడు రాగానే వుత్తరం వచ్చింది జానకి తండ్రిగారి దగ్గరనుంచి. భగవంతుని దయవలన ఈ సారి కవల పిల్లలు పుట్టినట్లు, వాళ్ళ పేర్లు వేణు, శాంత అని పెడదామని వాళ్ళు మోజు పడుతున్నట్లూ, తన అభిప్రాయం తెలియజేస్తే సంతోషించ బోతున్నట్లూ, వ్రాశాడు. రాఘవరావు వుత్తరము చదువుకుని కూల బడ్డాడు 'ఏడాది ఆగినా పిల్లల నెంబరు మటుకు సాలువారీ కాక తప్ప లేదురా భగవంతుడా' అనుకుంటూ.

ఈసారి రాఘవరావుకు చికాకెత్తి పోయింది. పురుడు వెళ్ళ గానే వక క్షణం ఆలస్యం చెయ్యకుండా జానకిని పిల్లలతో సహా తీసు కొచ్చి తనింట్లో దిగపెట్ట వలసిందని వుత్తరం ఒకటి గజిబిజిగా బరికి పోస్టు బాక్సులో కసికొద్దీ గిరాటు వేశాడు. అక్కడ జానకి తల్లి దండ్రులు ఆశ్చర్య పోయారు. 'తొలుచూలు వెళ్ళగానే పోరితే గాని తీసుకు పోని అల్లుడుకి మలుచూలు కాగానే అంత అప్యాయత ఎక్కడి నుంచి పుట్టుకు వచ్చిందా' అని.

జానకి తల్లి పురిటిమంచంమీద కూర్చుని 'ఏమిటీ జానకి నాకు మంచి అల్లుడే దొరికాడు వట్టి తిక్క మనిషిలాగా వున్నాడే' అంది. జానకి నవ్వి వూరుకుంది. 'ఎంత మారిపోయావే తల్లీ' అంటూ మెటికలు విరుచుకుంది జానకితల్లి.

చంద్రాన్ని వెంటబెట్టుకుని వెళ్ళిన జానకి చంద్రంతోపాటు వేణు, శాంతలను గూడా వెంటబెట్టుకువచ్చింది. బండి దిగుతుండగానే ఎదురు వెళ్ళాడు రాఘవరావు. జానకి వేణుని ముందుదిగిన తల్లి కందించింది. శాంతను రాఘవరావు చేతి కందిస్తుంటే మధ్య తనెందు కనుకుంది కాబోలు జానకి తల్లి వేణుని తీసుకుని లోపలికి వెళ్ళింది. జానకి బండి కమ్మి పట్టుకుని మెల్లిగా దిగుతూ 'ఏమండి...అంత తొందరచేశారు...

మా అమ్మవాళ్లు నన్ను నాలుగు రోజులు వుంచుకుందామని సరదా పడుతుంటే' అంది.

"ఫలితం ఒక్కటే అయినప్పుడు మళ్ళీ అక్కడే ఎందుకూ... యిక్కడే పడివుంటే సరిపోతుంది" విసురుగా లోపలకు వెళ్ళిపోయాడు పిల్లను తీసుకుని. జానకి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ యింటి లోకి మెల్లిగా అడుగులు వేసింది.

జానకి తల్లి వూళ్లో వున్న పదిరోజులూ మల్లెపూలు యింటికి రాకపోతే బజారు కయినా పోయి తీసుకు వచ్చేంది. గులాబి పూల యితే దొడ్లోనేవిరగపూస్తున్నాయి. జానకి కొప్పునిండా పూలు పెట్టుకుని తనవంక వెక్కిరిస్తున్నట్లు అనిపించేది.

జానకి తల్లి యింటికి వెళ్ళిపోయింది.రాఘవరావు పొద్దున్నే అందరి కంటే ముందుగా లేచి దొడ్లో పూసిన గులాబి పూలన్నిటినీ కోసి ఎవ రికీ కనపడకుండా దాచేశాడు. యింట్లో ఎప్పుడు ఎవరూ పూలు కొన గూడదని ఒకనిర్ణయం జారి చేశాడు. చంద్రానికి అప్పు మాటలు వచ్చేస్తున్నాయి. జానకి చంద్రానికి పెద్దజడవేసి చెవులో రోజూ ఎదో రహస్యం నూరిపోసేది. రోజూ మరచిపోతున్నాడు. ఆరోజు రహ స్యంతో పాటు నాలుగు దెబ్బలు గూడా తగిలించటం వలన రాఘవ రావు రాగానే ఆడపట్టుకుని 'నాన్నా, పూలు కావాలి'' అన్నాడు. జానకి మంచం మీద పిల్లలకు పాలిస్తూ అతని వంక చూస్తూ చిలిపిగా నవ్వింది!

"పూలూ లేవు గీలూలేవు పోరా. ఎక్కడో పూలు కావాలిట ఆడపిల్లలకు మల్లే" చీదరించుకుంటూ గదిలోకి పోయాడు. జానకి చెప్పిన ప్రకారం చంద్రం ఏడుపు మొదలు పెట్టాడు. రాఘవరావు మెల్లిగా విప్ప తీస్తున్న కోటును వక్కసారి లాగేసి,మంచం మీదపారేసి బయటకు వచ్చాడు. చంద్రం కళ్ళు నులుముకుంటూ తండ్రి రావటం చూసి ఏడుపు పెద్దది చేశాడు.

రాఘవరావు చంద్రాన్ని ఎత్తుకొని 'తప్పుకాదు బాబూ ఏడవచ్చా! ఆడవాళ్ళకి గాని పూలు మన మగ వాళ్ళ కెందుకురా నాన్నా. చూడు

నేను పూలు పెట్టుకున్నాను" బుగ్గలను సవరిస్తూ సముదాయించటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"అయినా ఈ కొంపలో ఆడవాళ్ళకు మటుకు పూలెందుకూ" అంది జానకి మంచంలోంచి.

"మనుషులుండగా పూలెందుకూ" అన్నాడు రాఘవరావు చంద్రాన్నికిందికి దింపుతూ.

."ఆ....వున్నారు. ఎందుకూ?" అంది జానకి వస్తున్న నవ్వును అణుచుకుంటూ.

రాఘవరావు నవ్వుకుంటూ వంటింట్లోకి పోయాడు.

ఈసారి జానకి తల్లివచ్చింది. వచ్చినట్లుగానే తిరిగివెళ్ళిపోయింది. "మలుచూలు అంటే వోని గదా అని వూరుకున్నాం గాని, తడవ తడవకీ ఏడాదికి ఆరునెలల చొప్పున మీ యింట్లోనే వుంటే మాకేం ముద్దుముచ్చట అక్కర్లే దనుకున్నారా"అని నిశితంగా విమర్శించింది రాఘవరావు అమ్మమ్మ.

జానకి తల్లి చేతిలో వున్నపని గనుక ఆవూళ్లో వాళ్ళందరికీ జానకి వద్దని చెప్పుతున్నా వినిపించుకోకుండా పంచదార చిలకలు, చలిమిడీపంచిపెట్టి వచ్చింది.

ఇంట్లో జనసంఖ్య పెరిగింది కొత్తగా వచ్చిన చంటిపిల్లతో. "ఈ పిల్లపేరు పెట్టడానికి తొందరేం" అని రాఘవరావుతో జానకి అన్నమాటలు గుర్తువచ్చినాయి. అప్పటినుంచీ యిప్పటిదాకా ఆపిల్లపేరు "చంటిది" అంటూ చలామణి అవుతూ వచ్చింది. కాని యిప్పుడో "చంటిది నంబరు వన్" "చంటిది నంబరు టూ" అంటూ పిలవాల్సి వచ్చేటట్లయింది.......

రాఘవరావు గతంలోనుంచి వర్తమానంలోకి వచ్చాడు అతి కష్టం మీద. వక్కసారి వుల్కిపడి గది దగ్గరకు వెళ్ళి "ఎట్లా వుంది అమ్మమ్మా..."అని అడిగాడు.

"యిప్పుడే కాదురా సింగి వచ్చింది....బురఖపట్టుకు యింకా కాసేపు అట్లాగేకూర్చో. తొందరపడితే-మనచేతిలోవున్నపని గనకనా" అంది వోరగా తెరిచిన గది తలుపులు తిరిగి మూసివేస్తూ.

రాఘవరావు బరువుగా అడుగులు వేస్తూ చంటిపిల్లవున్న మంచం దగ్గరకుపోయి దానిమీద కూర్చోబోతుండగానే "క్యావు క్యావు" మంటూ గదిలోంచి ఏడుపు వినవచ్చింది.

చంటిపిల్ల బుగ్గలు మృదువుగా తాకుతూ "యివ్వాల్టినుంచి నిన్ను సుశీ' అని పిలుస్తాను''అన్నాడు, ముసలమ్మ గదిలోనుంచి తడబడుతూ వచ్చి 'ఆడపిల్లరా రాఘవా, ఆనందం అంతా వెళ్ళగక్కింది.

"ఆడపిల్ల అంటే అదృష్టం అనిరా. మళ్ళీ ఆడపి[illegible] అంటే నీ జాతకం బంగారం అన్నమాట'' అంది ముసలమ్మ మళ్ళీ గదిలోకి వెళ్ళిపోతూ.

"మళ్ళీ...ఆడపిల్లేనా. పేరేం పెట్టమంటావే''అంటూ మంచం మీద కూలబడ్డాడు రాఘవరావు.

సింగి వగరుస్తూ గది బయటకు వచ్చింది. "ఎంత అదృష్టం అయ్యగోరుది ... పిల్లా తల్లి బతికి బట్ట గడతారనుకోలేదయ్యా... మాచెడ్డ కట్టం అయిపోయినాది అబ్బ...అబ్బ...'' సింగి ముఖం అంతా చిటచిట లాడించి గంభీరంగా నిట్టూర్చింది.

''ఏం సింగీ ఏమయింది?'' రాఘవరావు వుత్సుకత వెళ్ళబుచ్చాడు.

"ఏం సెప్పమంటారయ్యా.........కవలపిల్లల్ని గని ఏడాదన్నా సరిగ్గా నిండింది గాదామె...పిల్లలో పానం ఏముందండి....మీతో చెప్ప టానికయితే నాకే మనసొడటంలేదు గాని, మీరే యేదైనా ఆలోచన సెయ్యరాదుటండీ'' సింగి నవ్వబోయి ఎందుకన్నట్లు వూరుకుంది.

ముసలమ్మ యింట్లో నుంచి వస్తూనే "వాడితో ఏం కబుర్లే... నీ కేది కావాలో నన్నడగ రాదుటే" అంది.

"నేనేం మీ సింగిని కొరుక్కుతినటం లేదులే"విసురుగా మంచం మీదనుంచి తుండుగుడ్డ బుజంమీద వేసుకుని నిలబడ్డాడు.

"అయ్యేం మాటలండి అయ్యగారూ...." సింగి ఎక్కడలేని సిగ్గు అభినయిస్తూ ముసలమ్మ వైపు వెళ్ళింది.

"అసలే ఆడపిల్ల...! అందులో మూడోది!! దీనికి భార సాగీరసాల లాంటి ఆర్భాటాలు ఏవీ చెయ్య నక్కరలేదు" అని మనసులో తీర్మానించుకున్నాడు. జానకి తల్లి ఆడదవటంవలన 'ఏం, ఆడపిల్లయితే అంత తీసిపోయిందా....దీనికిగూడా అందరితోపాటు ముచ్చటలన్నీ తీరాల్సిందే" అంటూ పట్టు పట్టింది.

వీల్లేదన్నాడు రాఘవరావు.

"ఇక్కడ చెయ్యటం యిష్టంలేకపోతే మా వూళ్ళో చేయిస్తాం...అక్కడికి పంపించండి" అంది జానకి తల్లి.

"మాకేం చేతకాక మానెయ్యలేదు" అన్నాడు రాఘువరావు.

"చేతనయితే చెయ్యండి...నే నడిగేది అదేగదా!" అంది జానకి తల్లి. ఆడవాళ్ళతో వాదించటం అంత బుద్ధి తక్కువ పని లేదనుకున్నాడు రాఘువరావు.

భారసాల యథావిధిగా జరిగిపోయింది. వచ్చిన పెద్దలంతా అక్షింతలు చల్లుతూ "పదిమంది పిల్లలతో యిల్లు కలకాలం వర్ధిల్లాలి" అని దీవించారు.

"వీళ్ళు యింకా అయిదు భారసాలలు, ఈ యింట్లో జరగాలని చూస్తున్నారు కాబోలు....ఈ సారి వక్కళ్ళని గూడా పిలవనని" నోరు కరుచుకున్నాడు.

గడియారం ముళ్ళు తిరుగుతుంటే, సూర్యుడు ఉదయించడం, అస్తమించటం—రోజులు గడిచి పోవటం జరుగుతోంది. ఈ మధ్య గోడ గడియారం పాడయిపోయి ఆగిపోయినా, సూర్యుడు మటుకు ఆగలేదు. రోజులు గడచిపోతూనే వున్నాయి. జానకిని వదిలివుండే వీలు కనపడటంలేదు. వదలక యింట్లోనే వుండనియ్యటం వలన కలిగే సాలాదాయాన్ని, అరికట్టటం ఎలాగో అర్థంకావటంలేదు.

రాఘువరావు ఒకరోజు తెల్లవారుజామున లేచి బాగా ఆలోచించాడు. ఫామిలీ ప్లానింగులాంటి మాటలు కొన్ని మెదడులో మెరిసి

అప్పుడే అదృశ్య మయి పోయినాయి. తను ధీరోదాత్తుడై తన కుటుంబం పెరుగకుండా వుండేందుకు సలహా అడుగుదామన్నా అందుకు తగిన డాక్టరు ఆ వూళ్ళోనే కాకుండా, దగ్గరలో వున్న మరే వూళ్ళో గూడా లేడు.

జానకితో ఆవిషయం తీసుకువద్దామని ఎన్నిసార్లో ప్రయత్నించి విఫలు డయాడు. జానకి దగ్గరకు ఎప్పుడుపోయినా పసిపిల్లను వళ్లో పెట్టుకునే కనబడుతోంది. వంట పనంతా ముసలమ్మ వక్కత్తే చూస్తోంది. జానకి దగ్గరకు పోయి పెదిమ కదపగానే పసిపిల్ల 'తనను అక్కర్లేదని చెప్పటానికి వస్తున్నాడ'న్నట్లు చూసేది. రాఘవరావు గుండెను పదిలం చేసికోలేక వెనక్కి వచ్చేస్తున్నాడు.

ఆరోజు రాత్రి జానకి తమలపాకు చిలకలందిస్తూ చాలా ముభావంగా "రేపు డాక్టరమ్మ దగ్గరకు వెడదామనుకుంటున్నాను" అంది. రాఘవరావు కొంచెం తికమకపడ్డాడు.

"వంట్లో కులాసాగా వుంటోందా జానకీ...." పసిపాప అతని వైపే తిరిగి వుంది. పాప కిప్పుడే నెల వెళ్లింది. చూపు నిలప గలుగుతోంది.

"వంట్లో యిప్పుడైతే కులాసాగా వున్నా. ముందు ముందు ఎట్లా వుంటుందోనని భయంగా వుందండి" అంది జానకి.

"పిల్లలు యింక కలగకుండా ఏదైనా మందిమ్మని అడుగుదామని వుంది."

"తొందరపడి ఏమందు పుచ్చు కోక సుమా...బాగా ఆలోచించి పుచ్చుకో....అది సరేగాని యీవూళ్ళోవున్న డాక్టరమ్మ మంచిదేనా" రాఘవరావు అడిగాడు.

"మంచిదేనా...అంటే"

"ఏం లేదు; మందు శ్రద్ధగా మంచిది యిస్తుందా అని" అటువంటి సంభాషణ ప్రత్యక్షంగా చెయ్యటం యిద్దరి మనసులకూ కటువుగానే వుంది. రాఘవరావు వీపుమీది భారం తగ్గినట్లయింది. వంగిన నడు

మును సూటిగా నిలిపి "రేపు బాగానే వుంచి పోయిరా...మళ్ళీ యీమాట మా అమ్మమ్మతో అనక" అన్నాడు.

జానకి మనస్సు పరిపరి విధాల పోతోంది. యింటినిండా "నా కది కావాలీ.......యిది కావాలీ" అని వేధించుకు తినేవాళ్ళే. పిల్లలంటే ఎప్పుడన్నా వచ్చి చూసి పోయేవాళ్ళకు ముద్దుగాని—రోజూ యింత కంటే నరకం యింకొకటి లేదు సుమా! అనుకుంది.

ఆసుపత్రికి పోవటం, అందులో అటువంటి పనిమీద, అదే కొత్తయినా, కావలసిన డాక్టరు దగ్గరకు సూటిగానే చేరుకోగలిగింది. అప్పటికే ఆవిడ చుట్టూ చాలా మంది చేరి వున్నారు. జానకి ఎలానయితే నేం చొరవ చేసుకుని "నమస్కార మండి" అంది. ఆ వూళ్ళో నమస్కారం పెట్టగల సంస్కృతి వున్నవాళ్ళే తక్కువ. అందులో ఆడవాళ్ల మాట చెప్పటం మరీ కష్టం. డాక్టరమ్మ ప్రతి నమస్కారం చేస్తూ చాలా సంతోషంగా "ఏం కావాలమ్మా" అంది.

"మీతో కొంచెం రహస్యంగా మాట్లాడాలి" అంది జానకి. పక్కనున్న ఆడవాళ్లలో చాలామంది ఎవరి ముక్కులమీద వాళ్ళు వేళ్ళు వేసుకున్నారు, ఆడదాని దగ్గర దాచే రహస్యం ఏమిటా అని.

"అట్లాగే, తప్పకుండా. చూడండి! మీకంటె ముందుగావచ్చి కూర్చున్న వాళ్లని పంపించేస్తే. మనం కొంచెం తీరికగా మాట్లాడుకో వచ్చు" అంది డాక్టరమ్మ స్టెతోస్కోపును మెడమీదనుంచి చెవులమీది కెక్కించుకుంటూ.

ఒక్కొక్కరే ముందుకు వస్తున్నారు. మందు చీట్లు రాసి యిచ్చేస్తోంది డాక్టరమ్మ.

"ఏమమ్మా.. నీకేం కావాలి" డాక్టరమ్మ సిగ్గుపడుతున్న 30 యేళ్ల పడుచుదాన్ని చూసి అడిగింది. ఆమె తలమీద అక్కడక్కడా తెల్లని వెంట్రుకలు నల్లటి వాటిని కాదని కనపడుతున్నాయి.

"మీతో రహస్యంగా, మాట్లాడదామని...."నసిగింది ఆమె.

"చెప్పమ్మా...మన ఆడవాళ్ల దగ్గర ఆడవాళ్లు మాట్లాడటానికి సిగ్గెందుకు చెప్పమ్మా, చెప్పు..." డాక్టరమ్మ జానకివైపు తిరిగి "యిటువంటి వాళ్లని

గురించి మనలో సామెత గూడా వకటి వుండాలి గదండీ" అంది. జానకి ఉక్కిరి బిక్కిరి అయి ఔనన్నట్లు తల వూపింది.

"మా ఆయన కేమైనా మందిప్పిస్తారేమోనని"

"ఏం...."

"కాపురానికి వచ్చి అయిదేళ్లయిందండి....నా కడుపున వక కాయ పండుతే మా అమ్మ చూద్దామని అనుకుంటూంది" ఆమె స్వరం గీరపోయి గద్గదమైంది. ఆ పడుచుదాని బాధ డాక్టరమ్మతోపాటు జానకి గూడా అర్థం చేసుకుంది.

"నీకేం భయంలేదమ్మా...సింగీ! ఈ విడని తీసుకుపోయి పరీక్ష చేయవే—మీ ఆయన్ని పట్నం పంపించమ్మా...అక్కడ పరీక్షచేసి మందిస్తారు....మేం యిక్కడ చేయగలిగిందేమీ లేదు..." ఆ పడుచు దాని అమాయకమైన మాతృత్వ వాంఛకు జానకి అబ్బురపోయింది.

"నీ పేరేమిటి...."

"పోచమ్మ..."

"నీకేం కావాలి..."

చెప్పటానికి సందేహించిం దామె. డాక్టరమ్మ నవ్వుతూ చెప్ప మన్నట్లు తల వూపింది. తన కడుపువంక అదే పనిగా చూస్తూ—

నాకెనిమిది మంది పిల్లలమ్మ గోరూ...చచ్చిపో తున్నా నంటే నమ్మండి...మళ్ళీ నేమో..." డాక్టరమ్మ ఆ నిండు చూలాలివంక చూచింది.

"బాగానేవుందీ చల్లని కడుపన్నమాట పదిమంది పిల్లల తల్లివి అయినావంటే..."

"అది కాదండీ.... దీని నేమన్నా చెడగొ...డ...తా"

"ఛీ...చెంపలు వేసుకో...సిగ్గులేదూ! డాక్టరమ్మ మండి పడింది "భగవంతుడు నీమీద కరుణించి బిడ్డనిస్తానంటే వస్తున్న బిడ్డనిమధ్యలో నాశనం చెయ్యమంటావు...ఆ"...ఆ.... చూలాలు గజగజ లాడింది.

"మీ అమ్మా అయ్యా అంతా బాగున్నారా" డాక్టరమ్మ సముదా యింపుగా అడిగింది మళ్ళా.

"అ........."

"ఏ వూళ్ళో..."

"యిక్కడేనండి..."

"నాదగ్గరికి వకసారి తీసుకురా. మీ అమ్మని తీసుకువస్తే చాల్లే. మీ అయ్యకి ఎంతమంది పిల్లలు."

"సరిగ్గా పదిమందండి."

"యింకేం బాగానేవుంది. అయ్యపోలిక వచ్చిందన్నమాట."

"అంతా అదే అంటున్నారండి. నేనేమో చేసుకోలేక చస్తున్నాను."

"ఈ మాటే మీ అమ్మ అనుకుంటే నీ గతేం అయేది"

ఆ చూలాలు కంపించి పోయింది. అటువంటి అలోచన తట్ట లేదు యింతవరకూ.

"అమ్మా! పొరపాటయిందమ్మా మళ్ళా ఎప్పుడూ రాను" పోచమ్మ నిండు హృదయంతో వెళ్లిపోయింది.

"నీ పేరేం అమ్మా"-డాక్టరమ్మ, ఎంతకీ ఈ జనం తరగరేం అన్నట్లు నిర్లక్ష్యంగా అడిగింది. జానకి అటూ యిటూ చూచి లేచి నిల బడింది.

"ఈ యిద్దరే నండీ. వాళ్లయి పోగానే మాట్లాడుకుందాం. కూర్చోండి. ఏమమ్మా నీ పనేంటి?"

అప్పుడే వచ్చిన యిల్లాలు "అమ్మా, నాకు పసిపాప నిప్పిస్తా మన్నారుగా. నా అంతట కని పెంచే భాగ్యం లేకపోయినా, ఎవరిపిల్లన యినా నాపిల్ల అనుకు నయినా బ్రతుకుదామని వుంది. ఎక్కడన్నా చూశారా అమ్మా" జాలి తొణికిస లాడుతోంది. జానకి లేచి "వస్తాను. డాక్టరుగారూ మళ్ళా వస్తాను." మెట్లు గబ గబా దిగుతూ "నాపిల్లల్ని ఎవరికి ఇయ్యటానికి వీల్లేదు. భగవంతుడియ్యబోయే బిడ్డలంతా నా దగ్గ రకు రావాలిసిందే. నారక్త మాంసాలన్నీ వాళ్ళకి పంచిపెడతాను. నా ప్రాణం పోయినా సరే,నాబిడ్డలకు నే న్యాయం చెయ్యలేను" అంటూ గొణుక్కుంటూ పోయింది.

జానకి సంతోషంగా యింటికి రావటం రాఘవరావుకి ఎంతో ఆనంద దాయకమయింది. గబ గబా బజారుకుపోయి మిఠాయి, పూలు అన్నీ వక పెద్ద సంచీ నిండా పట్టుకువచ్చాడు. ముసలమ్మ గూడా సంతోషించింది—రాఘురావు దారిలో పడ్డాడు గదా అని.

ఆరోజు రాత్రి రాఘవరావు "వెళ్ళిన పనయిందా" అని అడిగాడు. జానకి నవ్వుతూ తల వూపింది.

అతని ఆనందానికి అంతులేదు. జానకి ఆనందానికి అడ్డులేనేలేదు. రాఘవరావు ఆమె తల నిమురుతూ "నువ్వు చాలా తెలివైన దానివి జానకీ" అన్నాడు. జానకి నవ్వి వూరుకుంది.

యిప్పుడు యింట్లో ప్రతి రోజూ పండగే! ఫస్టు తారీకు నాటి సంగతి చెప్పనే అక్కర్లేదు. యిల్లంతా పూలవనమే. అప్పుడే అటువంటి తారీకులు రెండు మూడు గడిచిపోతున్నాయి. రాఘవరావు ఆరాత్రి జానకి కోసం తెచ్చిన పట్టుచీరె అరాత్తుగా పెట్టెలోనుంచి తీసి—

"జానకీ నీ సమయస్ఫూర్తికి, ధైర్యానికి మెచ్చి నీకీ పట్టుచీరె తెచ్చాను" అన్నాడు. జానకి అతని వంక చూస్తూ "యిటివ్వండిచూద్దాం" అంది.

రాఘవరావు ఆమె చేతిలో చీరెను పెట్టి, రెండు భుజాలమీద చేతులు వేసి తనవైపు తిప్పుకుంటూ—

"జానకీ నువ్వు ఎంత అందంగా వున్నావు....ఈపట్టుచీరె వేసుకుంటే యింకేమన్నా వుందా" బలంగా హృదయానికి హత్తుకున్నాడు.

"వూరుకోండి మరీను. మళ్ళా నెల తప్పింది. యిప్పుడే పట్టుచీరె ఎందుకు" అంది మెల్లిగా.

రాఘవరావుకు పెద్ద అఘాతం తగిలినట్లయింది.

"అదేమిటి! డాక్టరమ్మ దగ్గరకు వెళ్ళావు గదూ....?"

"ఎందుకు అంత ఆశ్చర్యం... వచ్చే నాబిడ్డలను వద్దని చెప్పటానికి మనసొప్పక యింటికి తిరిగి వచ్చేశాను" అంది తలవంచి అతని పాదాలవంక చూస్తూ...

రాఘవరావు నేత్రాలు అశ్రు పూరితాలయినాయి.

"నీకున్న జ్ఞానం నాకు లేకపోయింది జానకీ ....! నాబిడ్డలు నాకొ్కకుండా పోవటానికి వీల్లేదు'' అంటూ ఆమె భుజం మీద నుంచి చెయ్యితీసి, సావిట్లోకి వెళ్ళి నిద్ర పోతున్న పిల్లలందరికేసి చూసి వకొొక్కళ్ళనీ ముద్దుపెట్టుకున్నాడు. జానకి తన కడుపులోవున్న పిల్లను చేతిలో వున్న పాపతో చూస్తూ ముద్దుపెట్టుకుంది.

"మా అమ్మా, నాన్నా మంచివాళ్ళు" అన్నట్లు చూసింది చేతిలో పసిపిల్ల.

★